కథాపత్రిక సంకలనం - నవంబరు 2002

# జాలి గడి

బాంద్రా రిక్లమేషన్ బస్‌స్టాప్‌లో ఒకటో నెంబరు సిటీబస్సు ఎక్కి పరేల్ ఫ్లయ్‌ఓవర్ బ్రిడ్జి దాటిన తర్వాత వచ్చే స్టాప్‌లో దిగాం నేనూ, శ్రీమతీ ఓ శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో. ముంబయ్ మహానగరంలో పరేల్ ప్రాంతంలో మునిసిపల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో నడపబడుతున్న చాలా పెద్ద ఆస్పత్రులు కేంద్రీకృతమై ఉన్నాయి.

ఫ్లయ్‌ఓవర్ వచ్చేపోయే కార్లతో, టాక్సీలతో, సిటీబస్సులతో మహారద్దీగా ఉంది. వాహనాల్లోంచి వస్తున్న పొగలు కాలినడకన పోయే వేలాది ప్రజల ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోతున్నా జనసందోహానికి ఆ ధ్యాసే లేదు. ఉన్నా రుమాలు అడ్డం పెట్టుకోవడంకన్నా చేయగలిగిందేమీ లేదు. ఎవరి పనితొందర వారిది. ఎవరి గమ్యం వారిది.

ధూమపూరితమైన ఆ వాతావరణంలో ధుమధుమలాడుతున్న ముఖంతో శ్రీమతి నా వెనుకనే అడుగులు వేస్తుండగా, వాడియా పిల్లల ఆస్పత్రికి దారితీశాను. ఆమె కోపానికి కారణం లేకపోలేదు. ఆ రోజు మా రెండోవాడు గోపాల్ పుట్టిన రోజు. గోపాల్ వాడియా పిల్లల ఆస్పత్రిలో పీడియాట్రిక్ సర్జన్, రెసిడెంట్ డాక్టర్ల హాస్టల్లో ఉంటాడు. ఏ పది పదిహేను రోజులకో ఓసారి మాసిన బట్టలన్నీ ఓ ఫోల్డర్ బ్యాగ్‌లో పెట్టుకొని దర్శనమిస్తూ ఉంటాడు. అంతకుముందు ఓవారం రోజుల్నుంచీ శ్రీమతి వాడి పుట్టినరోజు విషయమై ఓ అరగంటసేపు ఫోన్‌తో కుస్తీపడి, సాధించి గుర్తుచేస్తూనే వుంది.

"శనివారం నేనొక్కణ్ణేకాదు, నా కొలీగ్ ఆనందూ, అతని భార్య ఫల్గునీ నాతోబాటు వస్తారు. పదకొండింటికల్లా ఇంటి దగ్గరుంటాం. మంచి లంచ్‌కి ఏర్పాట్లు చెయ్యి" అని ఫోన్ అందుకో గలిగినప్పుడల్లా చెబుతూనే ఉన్నాడు. ఒంటిగంటైనా రాకపోయేసరికి వండినవన్నీ ఓ రెండు టిఫిన్ క్యారియర్లలో సర్ది, ఓ బ్యాగ్‌లో అటూ యిటూ కదిలిపోకుండా న్యూస్‌పేపర్లు కారియర్ల చుట్టూ కుక్కి ఆ బ్యాగ్‌ని నా చేతికందించి, 'పదండి...' అంది.

హాస్పిటల్ ఆవరణలో అడుగు పెట్టేసరికి, గేటుకి ఎడమ పక్కగా ఉన్న వేపచెట్టు కిందనున్న ఓ సిమెంటు బెంచీ మీద కూర్చుని ఉన్నారు ముగ్గురూనూ. పక్కనే ఉన్న మరో బెంచీ మీద, మరాఠీ చీరకట్టులో సుమారు పాతిక పైబడ్డ వయసులో గల ఓ స్త్రీ మాటిమాటికి కొంగుతో కళ్లు వత్తుకొంటూ కనబడింది. ఆమె మౌనంగా రోదిస్తోంది. వీళ్ల ముగ్గురి ముఖాల్లోనూ దైన్యం గోచరిస్తోంది.

మమ్మల్ని చూస్తూనే ఫల్గుని లేచి, "రండి... అంకుల్, అంటీ! అనుకొన్న ప్రకారం రాలేక పోయాం. మేమే కాకుండా మీ గోపాల్ కూడా ఆగిపోవలసి వచ్చింది. మీరే ఇక్కడికి వచ్చేస్తారని గోపాల్ అంటూనే ఉన్నాడు," అని, మమ్మల్ని కూర్చోబెట్టి, తను పక్క బెంచీ మీద ఆ స్త్రీ పక్కగా

కూర్చుంది.

వాళ్లు రాలేకపోవడానికి ఆ మనిషే కారణమని, లేదా ఓ కారణమై ఉండొచ్చని ఊహించడానికి ఓ అరక్షణం పట్టింది. శ్రీమతి నా వంక చూసింది. ఒంటరిగా ఉన్నప్పుడు నన్నంటే నన్నటి నసపెడ్తుంది గానీ, నలుగురిలో ఉన్నప్పుడు ఏవిషయమై కూడా తేలిపోదు. 'ఏం జరిగిందో కనుక్కోండి' అన్నట్టుగా ఉన్నాయా చూపులు.

"చూస్తే... మీ అందరి ముఖాల్లోనూ ఏదో నైరాశ్యత గోచరిస్తోంది. ఏం జరిగిందేమిటి?" అని ప్రశ్నించాను.

ముందు ఎవరూ పెదవి విప్పలేదు. తర్వాత ఫల్గుని నెమ్మదిగా, "అది కాదంకుల్ ఇంతకీ ఏం జరిగిందంటే..." అంటూ మొదలు పెట్టింది. ఆ తర్వాత వాళ్లు ముగ్గురూ ఎంతో కొంత తమ భారాన్ని దింపి వేసుకోవడానికా అన్నట్టు ఒకరి మాటలకు మరొకరు అడ్డుతగులుతూ చెప్పిన విషయమిది.

ఆమె పేరు సక్కూ గడేకర్, భర్త పేరు అశోక్ గడేకర్. వాళ్లది అహ్మద్‌నగర్ దగ్గరి ఓ పల్లెటూరు. మూడు నెలల క్రితం ఓ రోజు సాయంత్రం వాళ్లిద్దరూ తమ రెండేళ్ళ కొడుకు 'నట్టు'ని తీసుకొని ముంబయ్‌లోని ఆస్పత్రికి, అహ్మద్‌నగర్‌లో వాళ్ళ డాక్టరు చెప్పిన ప్రకారం వచ్చారు. పిల్లవాడు ఏమి త్రాగలేకా, తినలేకా, ఆ ప్రయత్నం చేయిస్తే ఏదో కొంత ఆహారం కడుపులోకి వెళుతున్నా బాధతో విలవిలలాడిపోతున్నాడు. గోపాల్, ఆనందూ కలిసి ఎండోస్కోపి పరీక్ష చేస్తే, ఆ వ్యాధి పోర్టల్ హైపర్‌టెన్షన్‌గా గుర్తించబడింది. అంటే గొంతులోంచి జీర్ణాశయంలోకి ఆహారాన్ని తీసుకొనిపోయే అన్నవాహికలో రక్తనాళాలు ఉబ్బిపోవడం వల్ల ఆ పరిస్థితి ఏర్పడుతుందన్న మాట.

వీళ్ళు గడేకర్ దంపతులకి అన్నీ వివరంగా చెప్పారు. ఎండోస్కోప్ సహాయంతో ప్రత్యేక సాధనాలతో అన్నవాహిక లోపల నెలకోసారి ఓ ప్రత్యేకమైన ఇంజక్షనివ్వాలి. అలా కనీసం ఏడెనిమిదిసార్లు ఇంజక్షన్లను ఇస్తే వ్యాధి నివృత్తి అయ్యే అవకాశముంటుంది. వచ్చినప్పుడల్లా పిల్లవాణ్ణి అవసరాన్ని బట్టి ఒకటి రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచాలి. మూడు వందలు చేసే ఆ ఇంజక్షన్ మటుకు మునిసిపల్ కార్పొరేషన్ హాస్పిటళ్ళ రూల్సు ప్రకారం, పేషెంటు తాలూకు వాళ్ళే కొనివ్వాలి. మిగిలిన వైద్యానికి మట్టుకు ఇంకేవిధమైన ఛార్జీలు ఉండవు. అశ్రద్ధ చేస్తే ఆపరేషన్ అవసరమౌతుందనీ, అందులో ఫలితం గ్యారంటీ ఉన్నా రిస్కు మాత్రం ఎక్కువనీ చెప్పారు.

'వచ్చిన వాళ్ళం ఎలాగూ వచ్చాం. ఆ ఇంజక్షనేదో రాసివ్వండి. ఇప్పుడే వైద్యం మొదలు పెట్టండి' అన్నదట సక్కూ. అశోక్‌గడేకర్ భార్య వైపు గుడ్లురిమి చూస్తూ అన్నాడట 'నట్టూ అంటే ఆస్పత్రిలో ఉంటాడు కాని, తలదాచుకోవడానికి మనకో చోటుండాలి కదా? మా మేనత్తగారి మనవడెవరో ఇక్కడ ఏదో మిల్లులో పన్జేస్తున్నాడట. మన ఊరు వెళ్ళి అతని అడ్రసూ అవీ తీసుకొని, కాస్త కాలూ చెయ్యి కూడదీసుకొని వద్దాం. ఏకంగా ఆపరేషన్ చేయించేద్దాం.'

ఎంత జనరల్ హాస్పిటలయినా, ఊరు కాని ఊరు వచ్చి వైద్యం చేయించుకోవడమంటే మాటలు కాదు. అందులోనూ ముంబయ్ లాంటి మహానగరాలంటే మరీ ఇబ్బంది. ఎంత దగ్గర బంధువులైనా ఒంటిగది కాపురాలెక్కువ. మాటిమాటికి వచ్చి వాళ్లని ఇబ్బంది పెట్టడం కూడా భావ్యం కాదు. వైద్యానికయ్యే ఖర్చులు పరిమితంగానే ఉన్నా, ప్రయాణాల ఖర్చులూ, ఇతర ఖర్చులూ తక్కువేమీ కావు.

'అంత తొందరగా ఉంటే మీరింటికి వెళ్లిపోండి. ఏదో విధంగా మొదటి ఇంజక్షన్ చేయించి నేను వస్తాను. వచ్చేసారి నుంచి అన్నీ చూసుకోవచ్చున'ని సక్కు మొండికేసింది. ఓవైపు కన్నతల్లి ఆరాటం, మరోవైపు ఆమె భర్త వాస్తవ దృక్పథం. చివరికి ఫల్గుని సక్కూని సమర్ధిస్తూ మొదటి ఇంజక్షన్ అప్పుడే చేయిస్తే బావుంటుందని సలహా యిచ్చింది.

గడేకర్ వెళ్ళి ఇంజక్షన్ కొని తీసుకువచ్చాడు. వాళ్ళు నట్వాకి ఆ ఇంజక్షన్ ఇచ్చి, ఓ రెండు రోజులు పరిశీలనలో వుంచి డిశ్చార్జి చేశారు. తల్లిగా సక్కూని వార్డు బయట కారిడార్‌లో పడుకోనిచ్చినా, అతను మటుకు వీళ్ళ సిఫారసుతో, సెక్యూరిటీ వాళ్ళ అనుమతితో అంబులెన్స్ గారేజిలో పడుకోవలసి వచ్చింది.

డిశ్చార్జి చేసిన తర్వాత, తిరిగి వాళ్ళ ఊరు వెళ్ళడానికి డబ్బులు లేకపోయాయి. వీళ్ళు ముగ్గురూ తలో వందా వేసుకొని గడేకర్ దంపతుల్ని వాళ్ళ ఊరు వెళ్ళడానికి ధనసహాయం చేశారు. ఆ వెళ్ళిన వాళ్ళు నెల కాదు కదా మూడు నెలలు దాటినా రాలేదు. రోజూ వందలాది రోగుల్ని చూసే వీళ్ల స్మృతి పథంలోంచి గడేకర్ దంపతులు మరుగుపడిపోతున్న సమయంలో, రెండు రోజుల క్రితం అంటే దాదాపుగా మూడున్నర నెలల తర్వాత ఎముకల పోగులా ఉన్న కొడుకుని తీసుకొని వచ్చి ఫల్గుని ఎదురుగా నిలుచుంది సక్కు

అశోక్ గడేకర్ వాళ్ళ గ్రామంలోని ఓ ఎలిమెంటరీ స్కూలు టీచరు. అతగాడికి వృద్ధులైన తల్లిదండ్రులూ, పెళ్లి కావల్సిన చెల్లెలూ, హైస్కూల్లో చదువుకొంటున్న తమ్ముడూ ఉన్నారు. వీళ్ళందరి బాధ్యతా గడేకర్‌దే. వాళ్ళ ఊరు తిరిగి వెళ్ళినప్పట్నుంచీ, మరుసటి దఫా ఇంజక్షన్ విషయమై భర్తని హెచ్చరిస్తూనే ఉంది. అతనూ ఆ విషయాన్ని ఇదిగో, అదిగో అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఆలోపుగా ఏవో రాసిచ్చిన మందులు వాడటం తప్పించి, మరో అడుగు ముందుకు వెయ్యనివ్వలేదు. నట్వా పరిస్థితి క్షీణించసాగింది.

సక్కు తన చేతికున్న రెండు బంగారు గాజుల్లోనూ ఓ దాన్ని అహ్మద్‌నగర్‌లో అమ్మి, ఆ సొమ్ము మొగుడి చేతిలో పెట్టి ముంబయి వెళ్ళే ప్రయత్నాలు చెయ్యమంది. 'ఇప్పుడంటే ఓ గాజును అమ్మావు. వచ్చేనెలకి మరొకటి అమ్ముతావు. ఆపైన? ఇక సంసారం గడవాలన్న ఆలోచన లేకపోతే ఎలాగని' తాడెత్తున లేచాడు. గడేకర్‌కి తల్లిదండ్రులు దన్నిచ్చారు. ఘర్షణ ఎంతవరకూ వెళ్ళిందంటే... రెండేళ్ల బాబు కోసం అన్ని వ్యయప్రయాసలు అనవసరం, మరో పాపని పుట్టించుకోవడం మంచిదన్నంతవరకూ వెళ్లింది! ఆ గాజుని అమ్మిన సొమ్ముని దగ్గు, ఆయాసంతో బాధపడే తండ్రి వైద్యం కోసమని కొంతా, చిల్లర బాకీలు తీర్చడానికి కొంతా

ఖర్చు పెట్టేశాడు.

సక్కు తల్లి హృదయం తిరగబడేటట్లు చేసింది. కొడుకుని తీసుకొని ముంబయి రావడానికి ఒంటరిగా సిద్ధమైతే 'వెళ్తే వెళ్ళావు గానీ, వట్టిచేతుల్తో తిరిగివస్తే మట్టుకు ఇంటి గడపలో అడుగు పెట్టనివ్వమన్నారు. ఆ వచ్చే మరణమేదో ఇంట్లోనే రావాలి కానీ అస్పత్రిలో మటుకు రాకూడదని రాక్షసంగా రాద్ధాంతం చేశాడు. ఓ అర్థరాత్రి మనసు విరిగిపోయిన సక్కు చడీచప్పుడూ కాకుండా ఇంట్లోంచి బయలుదేరి, అడ్డదారమ్మట అహ్మద్‌నగర్ చేరుకొని రైలెక్కింది. అదృష్టవశాత్తూ ఏ టికెట్ కలెక్టరు దృష్టిలోనూ పడకుండా ముంబయి చేరుకొంది. తన చేతికి వున్న రెండో గాజుని ఫల్గుని చేతిలో ఉంచి, అమ్మిపెట్టమని అర్థించి ఆ డబ్బుతో ఇంజక్షన్ చెయ్యమంది. వాళ్ళిచ్చిన మూడొందలూ తీసేసుకోమంది. 'మరి ముందు సంగతి?' అని ప్రశ్నిస్తే కూలీనాలీ చేసుకొని తన పొట్లు తను పడతానంది.

"అస్పత్రిలో ఎవరైనా మోసం చేస్తారేమోనని 'సరే ఆ గాజునివ్వు, వెళ్ళిపోయేటప్పుడు తీసుకుపోదువుగాని అని తీసుకొని నా దగ్గరుంచుకొన్నాను. కానీ, అంకుల్, పరీక్ష చేసి చూసేసరికి కేసు ముదిరిపోయిందని తెలిసింది. ఇంజక్షన్ల వల్ల ఫలితం లేదు. కుర్రవాడు విపరీతంగా బాధపడుతున్నాడు. రిస్క్ తీసుకొని ఆపరేషన్ చెయ్యడానికి నిశ్చయించాం. మా చీఫ్ సర్జన్ లీలా మేడమ్ స్వయంగా ఆపరేట్ చేసింది. గోపాల్, ఆనంద్ ఆమెకు అసిస్టెంట్లుగా సహాయం చేశారు. కానీ, లాభం లేకపోయింది. నిన్న రాత్రి ఈమె కొడుకు ఆ బాధ నుంచే కాదు, ఈ లోకం నుంచే శాశ్వతంగా విముక్తి పొందాడు. తర్వాతి ఏర్పాట్లకన్నీ ఇక్కడి హాస్పిటల్ స్టాఫ్ ద్వారా చేయించేశాం.

"వచ్చినప్పట్నుంచీ ఆ మనిషి శూన్యంలోకి చూస్తూ చెప్పిన మాటలు మమ్మల్ని చాలా కలచి వేశాయి. పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకుండా కూర్చుంది. ఈ ఉదయం నుంచీ ఒకరి తర్వాత ఒకరమూ, తర్వాత ముగ్గురమూ కలిసి ఇందాకట్నుంచీ ఎంత ప్రయత్నిస్తున్నా ఛస్తే తన ఊరు మటుకు వెళ్ళనంటోంది. ఈమె మానాన ఈమెను వదిలేస్తే ముంబయ్ మహానగరం సంగతి మీకు తెలుసుగా అంకుల్? ఏ పడరానివాళ్ళ చేతుల్లోనో పడితే ఆమె జీవితం నరకప్రాయమైపోతుంది ఏం చెయ్యాలో తోచట్లేదు", అంది ఫల్గుని.

నేను మటుకు ఏమని చెప్పగలను? నా ఆలోచనలకి ఓ రూపమిచ్చి వ్యక్తం చేద్దామనుకొనే లోగానే, అటువైపు వాళ్ళ చీఫ్ సర్జన్ లీలా మేడమ్ వచ్చింది. నన్ను చూస్తూనే 'భాయిసాబ్! ఏమిటిలా భాభీజీతో సహా వచ్చేశారు' అంది పలకరింపుగా.

"ఇవాళ మా గోపాల్ పుట్టిన రోజు. వీళ్ళ ముగ్గురి కోసమూ ఉదయం నుంచి చూసి చూసి క్యారియర్ తీసుకొని మేమే వచ్చేశాం!" అన్నాను చిన్నగా నవ్వుతూ.

"గోపాల్ పుట్టిన రోజన్న సంగతి నాకు తెలుసు. అయితే ఇక్కడ ఉండే ఒత్తిళ్ళ సంగతి మీరూ అర్థం చేసుకోవాలి. అంటున్నానని ఏమీ అనుకోవద్దు కానీ, వీళ్ళు ముగ్గురూ కూడా ఎమోషనల్‌గా అప్‌సెట్ అయ్యారు. ఈ అస్పత్రి నాలుగ్గోడల మధ్య అడుగుపెట్టే పేషెంట్ల

విషయమై రోగుల వైద్యానికి సంబంధించినంత మేరకు వైద్యులు శాయశక్తులా కృషి చెయ్యాలి. తప్పదు! అది వైద్యుల ధర్మం. ఆ హద్దులు దాటి రోగుల జీవితాల్లోకి తొంగిచూడడానికి ప్రయత్నించినప్పుడు, లేదా తమ ప్రమేయం లేకుండానే వాటిల్లోకి లాగబడినప్పుడు వీళ్ల ముగ్గురూ ఇప్పుడు పడుతున్న అవస్థల్లాంటివి ఎదురుకాక తప్పదు.

"ఇక్కడ ఇరవై మంది డాక్టర్లు రోజుకి పదిహేను వందలకి పైగా రోగుల్ని చూస్తుంటారు. అరడజను సర్జన్లు రోజుకి మొత్తం మీద డజనుకి పైగా ఆపరేషన్లు చేస్తారు. ఆ వచ్చే వారిలో ఎంతమందివో కన్నీటి గాథలు. వైద్యమంటే చెయ్యగలరు కానీ, ఎంతమంది జీవితాల్ని నెత్తిమీద వేసుకోగలరు? ఫల్గునీ! ఆమె మానాన ఆమెను వదిలిపెట్టు. కాస్త దుఃఖం తీరిన తర్వాత ఆమెకే కర్తవ్యం తెలిసొస్తుంది. అంతగా కావలిస్తే మీ హాస్టల్‌లోకి తీసుకుపోయి మీ గది ముందు ఓ చాప వేసి పడుకోబెట్టు. ఓ రెండు మూడు రోజులు ట్రామా నుంచి కోలుకొనే వరకూ ఏమైనా మందులివ్వు. ఏవో నాలుగు మెతుకులు తినేటట్టు చూడు. వస్తాను, అవతల బోల్డంత పని ఉంది" అని లీలా మేడమ్ వెళ్ళిపోయింది.

శ్రీమతి దిగ్గున లేచి, పక్క బెంచీ మీద సక్కుకు మరో పక్కన కూర్చుని క్యారియర్ తెరిచి ఆమె ముందుంచింది.

ఫల్గుని అన్న మాటలకు ఏం సమాధానం చెప్పాలో అనుకున్న నాకు లీలా మేడమ్ మాటలు సమంజసంగానే అనిపించాయి. సక్కు కూడా తను అనవసరంగా వాళ్ళ ముగ్గుర్నీ ఇరకాటంలో పెడుతోందని గ్రహించిందో ఏమో, శ్రీమతి తన చేతికందించిన క్యారియర్ గిన్నెలోంచి నెమ్మదిగా తినసాగింది. ఓ మెట్టు దిగివచ్చిందని అందరమూ ఓ దీర్ఘ నిశ్వాసం తీశాము.

రెండు రోజుల తర్వాత కాస్త మనసు ఊరట చెందిన తర్వాత, సక్కు ఫల్గునీ తిరిగి ఇచ్చిన తన గాజునీ, నేను కొనిచ్చిన టికెట్‌నీ, కొంత సొమ్మునీ గోపాల్ ద్వారా అందుకొని రైలెక్కింది.

ఈ ఉదంతం నాలో కొన్ని ఆలోచనలు రేకెత్తించింది. ధన సదుపాయం ఉన్న వ్యక్తులు కూడా ఓ పసికందు ప్రాణాలు కాపాడుకోవడానికి ఏ కార్పొరేట్ హాస్పిటల్లోనైనా లక్షలు వెచ్చించడానికి సిద్ధపడతారా? ఎంతో జీవితం గడిపి, అవసానదశలో కూడా ప్రాణాల మీది తీపి పోక, తల తాకట్టు పెట్టయినా వైద్యానికి పరిగెత్తే వృద్ధుల ప్రాణాల కన్నా, ముందు ఎంతో జీవితం గడపవలసిన పసికందుల ప్రాణాల విలువ తక్కువా? ఆ పసికందు ప్రాణాల విలువ తల్లి హృదయం గుర్తించినట్టు ఇతరులు గుర్తించలేరేమో?

సక్కు గమ్యం చేరిందో, లేదో నాకు తెలియదు. ఒకటి రెండు సార్లు మావాణ్ణి అడిగాను సక్కు సంగతి ఏమైనా తెలిసిందా? అని. 'మా మేడమ్ మాటలు మీకు వంటబట్టినట్టు లేదు. ఆలోచించి బుర్ర పాడుచేసుకోకండి' అన్నాడు గోపాల్ వేదాంతిలా.

ఆమె జీవితం ఏమైందో తెలియదు. తెలిసీ...?

ఎంతటి మహా సాగరానికైనా చెలియలి కట్ట తప్పదు. కరుణ సాగరం కూడా ఈ న్యాయాని కతీతం కాదేమో!